నిరుపయోగంగా మత్స్యశాఖ స్థలం!

- కిసాన్‌నగర్‌లో చేపపిల్లలను ఉత్పత్తి చేసిన స్థలం
- చేపల మార్కెట్ నిర్మించాలని మత్స్యకారుల డిమాండ్


కిసాన్‌నగర్ వద్ద నిరుపయోగంగా ఉన్న మత్స్యశాఖ స్థలం

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్, వేంపల్లి గ్రామాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న మత్స్యశాఖ స్థలం ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. గతంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఈ స్థలంలో నిర్వహించారు. చేప పిల్లలను నిల్వ చేసేందుకు సిమెంట్ కుండీలను నిర్మించారు. కానీ నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఆ స్థలం దశాబ్ద కాలంగా నిరుపయోగంగా ఉంది. సుమారు ఎకరం స్థలం ఉంటుంది. పాత జాతీయ రహదారి 44 పక్కన ఉండటంతో ఆ స్థలం విలువ కూడ ఎక్కువగానే ఉంటుంది. దీంతో ఆ స్థలంపై అనేక మంది కబ్జాదారులు కన్ను వేశారు. కానీ అధికారులు స్పందించి స్థలం వద్ద బోర్డును ఏర్పాటు చేశారు. స్థలాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు కరువు

కిసాన్‌నగర్ వద్ద నిరుపయోగంగా ఉన్న స్థలంలో చేపల మార్కెట్ నిర్మించాలని ఏళ్ల తరబడి నుంచి మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలను మత్స్యశాఖ అధికారులు తీసుకోలేదు. ఈ ప్రాంతంలో నిర్మిస్తే శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో చేపల వేటాడే మత్స్యకారులకు చేపలను విక్రయించు కోవడానికి అనువుగా ఉంటుందని మత్స్యకారులు పేర్కొంటున్నారు. చేపల మార్కెట్ లేక పోవడంతో వ్యాపారుల చేతిలో మత్స్యకారులు మోసపోతున్నారు. మార్కెట్ నిర్మిస్తే స్థలం వినియోగంలోకి రావడంతో పాటు మత్స్యకారులకు అనువుగా ఉంటుంది.

చేపల మార్కెట్‌ను నిర్మించాలి



కిసాన్‌నగర్ వద్ద ఖాళీగా ఉన్నా మత్స్యశాఖ స్థలంలో చేపల మార్కెట్‌ను ప్రభుత్వం నిర్మించాలి. మార్కెట్ నిర్మిస్తే చేపల విక్రయానికి అనువుగా ఉంటుంది. దీంతో దళారుల చేతితో మోసపోయే అవకాశం ఉండదు.

– నారాయణ, మత్స్యకారుడు, సోన్‌పేట్

క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులను బడిలో చేర్పించాలి



ఆర్మూర్: ఆరు నుంచి 18 ఏళ్ల లోపు వయసు గల దివ్యంగా విద్యార్థులను గుర్తించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా కో–ఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రాన్ని జీసీడీవో భాగ్యలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. కేంద్రంలోని రికార్డులను, ఐఈఆర్పీలు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. భవిత కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న సేవలను ఐఈఆర్పీ కిషన్ వివరించగా ఆయన స్వయంగా చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, సీజీవీ కవిత ఉన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: తెలంగాణ సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీని వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజ గంగారాం సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. భవిత కేంద్రంలో ప్రతివారం ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్స అందించారు. శిబిరంలో కిషన్, సురేశ్, అలేఖ్య, రఘు, రవి, కవిత పాల్గొన్నారు.

కేజీబీవీల తనిఖీ



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లోని కేజీబీవీలను జీసీడీవో భాగ్యలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. మారిన కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. పాఠశాలలో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట ఎస్‌వోలు భవాని, వినోద, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఒప్పందం ప్రకారం కొనుగోలు చేయాలి



బాల్కొండ: సజ్జ పంటను బై బ్యాక్ ఒప్పందం ప్రకారం ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన సీడ్ ఆర్గనైజర్ సజ్జలను కొనుగోలు చేయడం లేదంటూ గురువారం స్థానిక రైతులు రైతు వేదికలో ఏఈవో నరేశ్‌కు ఫిర్యాదు చేశారు. సీడ్ ఆర్గనైజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష తగదు



మాక్లూర్: ఎయిడ్స్ బాధితులపై వివక్ష తగదని ఎయిడ్స్ కంట్రోల్ జిల్లా అధికారి సుధాకర్ అన్నా రు. గురువారం మండలంలోని విజయ్ రూర ల్ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ పింగళి నరసింహ్మారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



పెర్కిట్: ఆర్మూర్ మండలం ఖానాపూర్‌లో గురువారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఖానాపూర్ వాస్తవ్యుడైన ఆర్మూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మోత్కూరి లింగా గౌడ్ తన ఐదు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో పామాయిల్ మొక్కలను నాటారు. ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు దీర్ఘకాల ఆదాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ ఆర్మూర్ డివిజన్ అధికారి రాజు, మాజీ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్, ఫ్రీయూనిక్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుదారులకు చేయూత


కూరగాయల సాగుదారులకు చెక్కు పంపిణీ చేస్తున్న శంకర్

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ఆర్థికంగా చేయూత అందిస్తోందని బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్ అన్నారు. బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా గురువారం సాలూర మండలంలోని హున్సాలో హున్సా, మందర్నా గ్రామాలకు చెందిన 8 మంది తీగ పందిరి కూరగాయల సాగుదారులకు రూ. 25 వేల చొప్పున చెక్కులను ఏఎంసీ చైర్మన్ పంపిణీ చేశారు. కూరగాయల సాగు పై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు కూరగాయల సాగుదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ వసంత్‌రెడ్డి, డైరెక్టర్లు బాలకృష్ణారెడ్డి, ఏవో శ్వేత, హార్టికల్చర్ ఆఫీసర్ వహీద్, ఏఈవో శ్రావణి, నాయకులు పద్మారెడ్డి, ఖాజాపూర్ అశోక్, సాక్యం రవి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల పేరు రాశారు..



సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన బోర్డుపై ఎట్టకేలకు పాఠశాల పేరును రాయించారు. గత నెల 7వ తేదీన సాక్షిలో ప్రచురించిన 'పాఠశాలకు ఊరు, పేరు లేదా?' కథనంపై పాఠశాల హెచ్ఎం లింగారెడ్డి స్పందించారు. సొంత డబ్బులు రూ. మూడు వేలు వెచ్చించి బోర్డుపై పాఠశాల పేరును రాయించి బాధ్యతను చాటుకున్నారు.

మాక్లూర్‌లో యూరియా కొరత లేదు


మాక్లూర్‌లో యూరియాను కొనుగోలు చేస్తున్న రైతులు


ఇస్సాపల్లిలో ఎరువుల పంపిణీని పరిశీలిస్తున్న స్వప్న

మాక్లూర్: మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయాధికారి పద్మ గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 19వేల200 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగవుతోంది. మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్ మొదటి నుంచి యూరియా మీద ప్రత్యేక దృష్టిపెట్టి రైతులకు అవసరమయ్యే యూరియాను ఎప్పటికప్పుడు తెప్పిస్తున్నట్లు సమాచారం. మాక్లూర్, కల్లెడి, డీకంపల్లి, గొట్టిముక్కల, చిక్లి, గుత్ప సొసైటీ గోదాముల్లో ఒక్కో లోడు యూరియా చొప్పున అందించినట్లు పద్మ తెలిపారు.

ఇస్సాపల్లికి చేరుకున్న యూరియా

పెర్కిట్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి సొసైటీ గోదాముకు గురువారం యూరియా చేరుకుంది. బుధవారం యూరియా కొరత ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందారు. సహకార శాఖ అధికారులు స్పందించి ఇస్సాపల్లి గ్రామానికి అవసరమైన 900 బస్తాల యూరియాను పంపించారు. క్లస్టర్ ఆఫీసర్ స్వప్న యూరియా పంపిణీని పర్యవేక్షించారు. అలాగే గోదాములో రికార్డులను పరిశీలించారు. సకాలంలో యూరియా రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సమ్మె నోటీసు అందజేత

రుద్రూర్: కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 9న తలపెట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొననున్నట్లు ఆశా వర్కర్లు, జీపీ కార్మికులు గురువారం పోతంగల్ మండల కేంద్రంలోని ఆయా శాఖల కార్యాలయాల్లో సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు అర్జున్, రాము, వసురాం, సాయిలు, సునీత, స్వప్న, సుజాత, రేష్మా, పంచశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

నవీపేట: పుస్తకాకాల కొనుగోలులో అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలు, బుక్‌స్టాల్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి తులసీరామ్ డిమాండ్ చేశారు. గురువారం ఎంఈవో అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తులను పరిష్కరించాలి



నవీపేట: పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జనచైతన్య వేదిక నాయకులు గురువారం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 400 దరఖాస్తులు డీఎస్‌వో కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయని స్థానిక రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక చొరవతీసుకుని దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంజీవ్, నాశేశ్వర్ సాయన్న, నాయకులు భూంరావ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మా పిల్లలు ప్రభుత్వ బడుల్లోనే..



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రామగిరి బాల గంగాధర్ తన ఇద్దరు కూతుళ్లను తాను పాఠాలు బోధిస్తున్న పాఠశాలలోనే గురువారం చేర్పించారు. ప్రయివేటు పాఠశాలలో చదువుతున్న కూతుళ్లు వర్షిణి 9వ తరగతిలో, అఖిలను 7వ తరగతిలో చేర్పించారు. సర్కార్ బడిలో విద్యా బోధనపై నమ్మకం కలిగేలా మా పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడు గంగాధర్‌ను హెచ్ఎం గంగారాం, ఉపాధ్యాయులు అభినందించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

బోధన్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరే విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని టీయూసీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బి మల్లేశ్ పిలుపునిచ్చారు. గురువారం ఎడపల్లి మండలంలోని జాన్కంపేటలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను బీడీ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఒడ్డెక్క, బుజ్జక్క, లక్ష్మి, సావిత్రి, మణేమ్మ, గంగామణి, సుజాత, గోదావరి, రాధ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష

బోధన్: ఎడపల్లి మండల శివారులోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాలలో 6, 7, 8 తరగతిల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం శుక్రవారం ప్రవేశ అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గంగాశంకర్ గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

బిల్లులు రావు.. పనులు కావు


బాల్కొండలో నిలిచిన నిర్మాణ పనులు

బాల్కొండ: మండల కేంద్రంలో కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణ పనులు బిల్లులు రాక మళ్లీ నిలిచిపోయాయి. మరుగుదొడ్ల కోసం గత ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ నుంచి రూ. 5 లక్షలను మంజూరు చేశారు. ఇప్పటి వరకు స్లాబ్ వేసి, గోడలను నిర్మించారు. రూ. 3 లక్షల పనులు చేపట్టినా ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. దీంతో పనులు మళ్లీ నిలిచి పోయాయి. ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం మాల మహానాడు, యశో బుద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. పెర్కిట్‌లో ఈ నెల 5న అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే బుద్ధునితో నా ప్రయాణం అనే నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల మహానాడు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు మాదరి రాజన్న, ప్రధానకార్యదర్శి ముగా ప్రభాకర్, పింజ పెద్ద భోజన్న, కోటేశ్వరరావు, తాళ్ల రాజయ్య, తెడ్డు నర్సయ్య, అంగరి ప్రదీప్, మూలనివాసి మాల, అగ్గు క్రాంతి, కృపాల్, పింజ అశోక్, అర్చన గంగన్న, సాయిరాం, రాజు, సురేశ్ వాగ్మరే, తదితరులు పాల్గొన్నారు.

సీఏకు సన్మానం



పెర్కిట్: ప్రపంచ చార్టడ్ అకౌంటెంట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ప్రముఖ చార్టడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్‌ను ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ చారి, రాజ్ కుమార్, దొండి లక్ష్మణ్, బద్రి లక్ష్మణ్, ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేశ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోస్రా తహసీల్దార్‌గా రాజశేఖర్



వర్ని: మోస్రా తహసీల్దార్‌గా బొడ్డు రాజశేఖర్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ మారుతి బదిలీపై కామారెడ్డి వెళ్లారు. బోధన్ ఉప తహసీల్దార్‌గా ఉన్న రాజశేఖర్‌ను మోస్రాకు నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చందూర్ తహసీల్దార్‌గా లకావత్ పీర్ సింగ్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళిక

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రణాళిక కార్యచరణ మున్సిపల్ పరిధిలో కొనసాగుతోంది. పట్టణంలోని 18, 33వ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమం, ఘన వ్యర్థపదార్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇన్‌చార్జి శానిటరి ఎస్సై సురేశ్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు నర్సయ్య, ప్రజ్ఞాన్, శానిటరి జవాన్లు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

నేటి చిత్రం

గుంతతో తరచూ ప్రమాదాలు



డొంకేశ్వర్: తొండాకూర్–డొంకేశ్వర్ ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంత కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు కుంగి గుంతగా మారడంతో డొంకేశ్వర్ నుంచి వచ్చే వాహనాలు సమీపానికి వచ్చేంత వరకు గుంత కనిపించడం లేదు. దీంతో వాహనదారులు దానిని తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుంగిన రోడ్డును, గుంతలను సరి చేయాలి.

– నునావత్ శంకర్, దత్తాపూర్

మాకు ఫొటో పంపండి

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్: 99636 95349

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



వేల్పూర్: పదో తరగతి వరకు తమతో కలిసి చదువుకొని అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి తోటిమిత్రులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన ఆకాశ్ గత నెల 20న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న ఆకాశ్ 2015 పదోతరగతి మిత్రులు రూ. 50వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సంగెం అశోక్, అరవింద్, అరుణ్, భారత్, అమీర్, శివ, ఆనంద్, అనూష, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఎండుడే.. వానకు తడుసుడే!


షెడ్డు లేకుండా ఎండలో ఉన్న ఫైరింజన్

బాల్కొండ: మండల కేంద్రంలో ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు సొంత కార్యాలయం ఏర్పాటు కాలేదు. దీంతో స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఫైరింజన్ ఎండకు ఎండుతు వానకు తడుస్తోంది. దీంతో ఫైరింజన్ చెడిపోయే ప్రమాదం ఉందని ఫైర్ సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫైర్ స్టేషన్‌కు సొంత భవనం లేక ఐకేపీ కార్యాలయ భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి ఫైరింజన్‌కు వెంటనే షెడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సన్నాహక సమావేశానికి తరలిరావాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

వర్ని: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశానికి బాన్సువాడ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్ని మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సురేశ్ బాబా, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గోపాల్, జాకోరా సొసైటీ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గిరి, కృష్ణారెడ్డి, నరెడ్ల సాయిలు, అహ్మద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రంలో పలువురి బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం బీజేపీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కొత్తూరు గిరీశ్, డాక్టర్ అరుణ్, హరీశ్, మల్లయ్య, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక



బోధన్‌టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ నేస్తం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బుర్క శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ గుప్తా, కోశాధికారిగా రామ్మోహన్ ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్‌ఆఫ్ భవాని అధ్యక్షుడిగా ఘనపురం అశోక్, ప్రధాన కార్యదర్శిగా సాయి బాబా, కోశాధికారిగా బర్ల మధుకర్ ఎన్నికయ్యారు. నాయకులు, సభ్యులు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–10, 12, 14 విభాగం పోటీల్లో సత్తా చాటారు. 60 మీటర్ల పరుగు పందెంలో ఆరో తరగతి చదువుతున్న శ్రీలత కాంస్య పతకాన్ని సాధించింది. మరో 25 మందికి ప్రశంస పత్రాలను అందజేశారు. గురువారం పాఠశాలలో విద్యార్థులను ఎస్‌వో వినోద, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాం అందజేత

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాం దుస్తులను ఎంఈవో లోల శంకర్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం సాయిలు, ఉపాధ్యాయులు నాగ్‌నాథ్, రామారావు, షబానా, సుజాత, లత తదితరులు పాల్గొన్నారు.